# సముద్ర శిఖరం

కలువపాములు వెంకట నారాయణ రావుకు జ్ఞాపకశక్తి ఎక్కువ. అతను చరిత్ర స్టూడెంటు కూడాను.

మొదటి స్వాతంత్ర్య పోరాటం ఎప్పుడు జరిగిందో బాగా గుర్తు (1857). రెండవ తరగతిలో ఎక్కాలు బట్టీయం వేయించిన మేష్టరు పేరు స్పష్టంగా గుర్తు (కరణం యోగయ్య మాస్టారు); ఆంధ్ర రాష్ట్రం రావడానికి అమరణాంతం దీక్ష వహించింది ఎవరో — అది ఎప్పుడు అవతరించిందో నిస్సంశయంగా గుర్తు (పొట్టి శ్రీరాములు - 1953).

దేశవ్యాప్తంగా భాషా ప్రయుక్త రాష్ట్రాలు యేర్పడడం యెప్పుడో గుర్తు (1956); జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత దేశానికి ప్రధాని ఎవరో యిప్పటికీ గుర్తే (లాల్‌బహదార్ శాస్త్రి); బెజవాడకు రేడియో స్టేషన్ ఎప్పుడు వచ్చిందో గుర్తు (1948); తురుష్కులు కాంటాస్టినోపిల్‌ను యెప్పుడు చుట్టుముట్టారో అందువల్ల ప్రపంచంలో యెలాంటి చక్కని మార్పువచ్చిందో గుర్తు (1453, పండితులు దేశాలపాలు అయ్యారు); మొదటి ఆంధ్ర ఆస్థాన కవి ఎవరో గుర్తు (చెళ్లపిళ్ల); జ్ఞానపీఠ ఎవార్డ్ తమిళ రచయితలలో యెవరికి వచ్చిందో గుర్తు (అఖిలాండన్) అనాకెరనీనా అనే నవలను ఎవరు వ్రాశారో గుర్తు (కౌంట్ లియో టాల్‌స్టాయ్); ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్ష ప్యాస్ అయినప్పుడు తన నెంబరు ఎంతో గుర్తు (16469); మొదటిమారుగా గుర్రపుపందాలకు వెళ్ళినప్పుడు గెలిచిన గుర్రం పేరు, బరువు, నెంబరూ గుర్తు (ఎన్‌కోర్ - 59 - 5); తన రక్తం గ్రూపు యేమిటో గుర్తు (O); కళ్ళద్దాల పవర్ ఎంతో గుర్తు (మైనస్ 3.75; రీడింగ్ 1.5); మొదటి ఉద్యోగం ఊడినప్పుడు యజమాని తనతో అన్నమాటలు గుర్తు (మిషన్ కొంటున్నాం. అది మనిషి కంటె విశ్వాస పాత్రంగా పనిచేస్తుంది); పెళ్ళి చూపులకు వెళ్లినప్పుడు కాబోయే భార్యను నేనంటే ఎందుకు యిష్టం అని అడిగినప్పుడు ఆమె చెప్పిన జవాబు గుర్తు (నాకు మద్రాసులో కాపురం చేయాలని వుంది); బుచ్చిబాబు అసలు పేరు

యేమిటో తెలుసు (శివరాజు వెంకట సుబ్బారావు); ఆచార్యఆత్రేయకు మంచి పేరు తెచ్చిపెట్టిన నాటకాలు యేమిటో గుర్తు (యన్.జి.వో గుమస్తా; ఆ తరువాత కప్పలు); చిన్నప్పుడు తను ఆడిన ఆటలు యేమిటో గుర్తు (చెడుగుడు; బాల్ బాడ్మెంటన్)

అంతేకాదు. ఆది శంకరాచార్యులు దేశంలో మొత్తం ఎన్ని పీఠాలు స్థాపించారో గుర్తు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఎన్ని రాష్ట్రాలు యెప్పుడెప్పుడు చేరాయో గుర్తు. పక్షులలో ఎన్ని రకాలు - సంవత్సరానికి ఎన్ని గ్రహణాలు అంతాగుర్తు. విశ్వనాథసత్యనారాయణ యే సంవత్సరంలో చనిపోయారో, ఒమార్ఖయాంను మొట్టమొదటగా తెలుగులోనికి ఎవరు అనువాదం చేశారో, ఖలీల్ జిబ్రాన్ను ఎవరు వేశారో, భారతంలో కౌరవ సోదరుల నూరు పేర్లు యేమిటో... యివన్నీ క్షుణ్ణంగా గుర్తు.

భార్య సుజాత ఆరోజు ఉదయం ఇడ్లీలలోకి చట్నీ, కారపుపొడి (బాగా నెయ్యి వేసి ఊరినది) వేస్తూ గుచ్చి గుచ్చి ముఖంలోనికి చూచినప్పుడు విచిత్రంగా అనిపించింది ఆమె వాలకం. కారణం అడగలేదు, ఆవిడే చెబుతుందిలే అనుకుంటూ. ఉదయం పేపరు వార్తలు చదవడంలో లీనమయిపోయాడు. కొడుకు దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరం ప్యాంట్ జేబులోనే వుండి పోయింది. ఇంకా తెరిచి చదవనే లేదు. ఎందుకు చదవడం? - డబ్బు కావాలి, వెంటనే పంపమని ప్రార్థన లాంటి ఉత్తరువు. బాగా అలవాటు అయిన వ్యవహారమే. కొడుకు దూరంగా ఉత్తర హిందూస్తానంలో ఎం.ఏ. చదువుతున్నాడు. ఇక్కడ అలాంటి చదువులో 'సీట్' రావటానికి తగినన్ని మార్కులు రాలేదు మరి!

సుజాత 'రాత్రి భోజనానికి యేమేం చేయమంటారు?' అని అడిగింది.

రావు ఆమెవంక చూచి వూరుకున్నాడు. జవాబు కూడా చెప్పలేదు. ఆమే చెబుతుందని గుర్తే.

'దోసకాయ పప్పు పులుసులాగ చేస్తాను. పొట్లకాయ పెరుగు పచ్చడి. కాకరకాయ వేయిస్తాను. ఒడియాలు, అప్పడాలు యెలాగూ వుంటాయిగదా!' అంది ఆమె.

అలాగే చేయమన్నాడు రావు వెంటనే.

'మీరు వచ్చేటప్పుడు స్వీట్ యేదయినా తీసుకురండి. రాత్రికి అమ్మాయిని అల్లుడినీ భోజనానికి పిలిచాం గుర్తుంది కదూ–' అంది సుజాత.

నారాయణరావు 'ఊ' కొట్టాడు.

ఫలహారం ముగించి రెండో కప్పు కాఫీ కూడా తాగేసి సుజాతకు 'బై, బై' చెప్పేసి ఫ్లాటు నుంచి కిందకు రోడ్డు మీదకు వచ్చాడు. చకచక నడిచి 'ఎగ్మోర్' స్టేషన్‌వైపు వెళ్ళాడు. ఎలక్ట్రిక్ ట్రెయిన్‌లో పొడుగుని నిలుచునే ప్రయాణం చేసి 'థామస్ మౌంట్' చేరుకున్నాడు.

గది తలుపు బార్లాతీసి వుంది. డెస్క్ ముందు కూర్చున్నాడు. చుట్టూ ఖాళీ టేబుల్స్, కుర్చీలు, నిరామయత. చాలా ఆనందంగా వుంది ఈ నిశ్శబ్దం.

ఫలహారం బల్లముందు సుజాత ముఖకవళికలు గుర్తుకువచ్చాయి. ముక్కు ఉబ్బి కాస్త ఎర్రగా అయింది. ఇప్పుడో యింకాస్సేపటికో యేడ్చేట్లుగా వుంది... నెలకు అయిదారు మార్లయినా యేడుస్తుంది సుజాత.

రావు పనిచేస్తున్న కంపెనీ 'విజ్ఞాన సర్వస్వం' ప్రచురిస్తోంది. ఒకే ఒక 'వాల్యూం'. అంటే 'సంక్షిప్తపదకోశం' అన్నమాట. దానికి యేం పేరు పెట్టాలో యింకా నిర్ణయం అవలేదుగాని, 'మేటర్' మాత్రం తయారవుతోంది. 750 బొమ్మలు కూడా వున్నాయి. ఈరోజు 'సబ్బు' అనేమాట మీద 'వివరాలు' సేకరించి వ్రాయాలి. అతనికి ఈ పని సంతోషదాయకంగా ఆనందకరంగానే వుంటుంది, ఒక్క మేడిచర్ల దక్షిణామూర్తి వెనకాల వచ్చి నిలుచున్నప్పుడు తప్ప.

దక్షిణామూర్తి ఈ విజ్ఞాన సర్వస్వానికి 'జనరల్ ఎడిటర్', 'ప్రొప్రయిటర్' కూడా. అతనికి కింది ఉద్యోగస్తుల డెస్క్ వెనకాల నిలుచుని వాళ్ళు గమనించకుండా వాళ్ల పనిని గమనించటానికి పాట్లు పడుతూ వుండడం అలవాటు. అట్లా వెనుకాల నిలుచున్నప్పుడు నారాయణరావుకు వీపుమీద చెదలు పాకుతున్నట్లు అనిపిస్తుంది. దక్షిణామూర్తికి జుట్టు యిప్పుడిప్పుడే నెరుస్తోంది. 'ట్వీడ్' సూట్లు వేస్తాడు సాధారణంగా. కేలండర్లు అచ్చువేసి అమ్ముకోవడంతో ప్రారంభించాడు వ్యాపారం. ఇప్పటికీ కేలండర్లు మానివేయలేదు. రకరకాల బొమ్మల కేలండర్లు మత స్థాపకులు, సినిమా వ్యక్తులు, దేశనాయకులు, అందమయిన ఆడ పిల్లల బొమ్మలు... యిలా ఎన్నో వైవిధ్యాలు అగుపిస్తాయి. కేలండర్ల ముద్రణలో కూడా నారాయణరావు జ్ఞాపక శక్తి ఎక్కువ ఉపయోగపడుతూ వుంటుంది. అందుకనే అతనిమీద మంచి మమకారం. కన్న తండ్రిలాగ యోగ క్షేమాలు విచారిస్తూవుంటాడు. అతనికి హోమియో మందుల్లో అచంచలమైన విశ్వాసం. పచ్చికూరగాయలు తింటే బాగా ఆరోగ్యం కల్గుతుందని నమ్ముతాడు. అరవిందాశ్రమం వాళ్ల నేత్రవైద్యం పుస్తకం చదివిన తర్వాత కళ్లద్దాలు అవతల పారవేసి కంటినరాల ఎక్సర్‌సైజ్ ప్రారంభించాడు. నారాయణరావును కూడా అలాగే చేయమని చాలాకాలం వేధించుకు తిన్నాడు. ఈ వైద్యాలు నాగా

యణరావుకు మాత్రం సరిపడలేదు. అయినా దక్షిణా మూర్తి వచ్చి వెనకాల నిలుచున్నప్పుడల్లా నారాయణరావు సులోచనాల వంక 'కొరకొర' చూస్తాడు. నారాయణరావు ఆరోగ్యం అంతంత మాత్రం అయినదే, తరచు జలుబు చేస్తూ వుంటుంది. భోజనం చేశాక కళ్ళు ఎర్రబడి పోతాయి. శీతాకాలం ఐతే పదేపదే 'లావటరీ'కి వెళ్లవలసి వస్తుంది. దక్షిణామూర్తి అతనికి ఉచిత వైద్య సలహాలు అందించడం కూడా కర్తవ్యంగానే భావిస్తాడు.

ఉదయం – దక్షిణామూర్తి అతని గదికి రెండు పర్యాయాలు వచ్చాడు. మొదటిమారు అయిదు నిమిషాలపాటు నారాయణరావు బల్ల వెనకాల నిలబడి తరువాత 'యింకా స-లోనే వున్నావా;' అనేసి వెనక్కు తిరిగాడు. రెండో మారు యెనిమిది నిమిషాల పాటు గమనిస్తూ వుండి చివరకు 'చూడు. నారా యణ రావూ... నీవు వొళ్ళు చేస్తున్నావు. ఈ వయసులో వొళ్ళు చేయడం మంచిదికాదు... రాత్రిపూట గోధుమ తినడం ప్రారంభించు...' అన్నాడు. నారాయణరావుకు వీపుమీద చెదలు పాకడం ఎక్కువైంది.

భోజన సమయానికి ముందు నారాయణరావు కూతురు 'నీరజ' ఆఫీసుకు వచ్చింది. రంగు రంగుల కాగితాలు చుట్టి అందమయిన 'టేపు'తో సుందరంగా తయారుచేసిన చిన్న పొడుగుపాటి 'పాకెట్' అతనికి అందించి 'ఇలాంటి శుభ సన్నివేశాలు యింకెన్నో రావాలి, మానాన్నకు...' అంది.

నీరజకు యిరవయి రెండేళ్ళు. నాలుగేళ్ల కిందటనే హాయిగా పెళ్ళిచేసు కుని 'వేరింటి కాపురం' చేస్తోంది. మొగుడు యేదో తగుమాత్రం ఉద్యోగంలో వున్నాడు. అయినా తను మాత్రం పెళ్లికాక ముందు నుంచి వున్న బాంక్ ఉద్యోగం మానివేయలేదు. ఆమె బ్యాంక్ నారాయణరావు ఆఫీసుకు పది నిమి షాల నడక దూరంలో వుంది.

నారాయణరావు నిర్ఘాంతపడిపోయి ఆ 'పేకట్' విప్పి చూసాడు. ఫౌంటెన్ పెన్. బంగారపు పాళీ, బంగారుపు కేప్. గడిచిన ఆరేళ్ళుగా సుజాత యిలాంటి కలాలు నాలుగు ప్రజెంట్ చేసింది తండ్రికి.

'ఎందుకమ్మా ఈ ప్రెజెంటేషన్ ఇప్పుడూ?' అన్నాడు నారాయణరావు.

'యేం నాన్నా నాతో వేళాకోళం ఆడుతున్నావా?' అంది నీరజ ముద్దుగా ముఖం పెట్టి.

నారాయణరావు ఆలోచనలో పడ్డాడు.

ఈరోజు పుట్టిన రోజుకాదు (అది 14 ఫిబ్రవరి), యిదేమీ పండుగ సమయం కాదు.

నీరజకు కంగారు అయింది. 'మరిచిపోలేదు గదా నాన్నా' అంది భయం భయంగా.

నారాయణరావుకు ఉదయం భార్య బ్రేక్ ఫాస్ట్ టేబుల్ మీద పెట్టిన ముఖం గుర్తుకు వచ్చింది. కొంప మునిగింది - అనుకున్నాడు. తన వల్ల పెద్ద తప్పిదమే జరిగింది.

సాయంకాలం యింటికి వెళ్లేటప్పుడు కిలో మల్లెపూలు, కిలో మందారాలు తీసుకువెళ్లు నాన్నా - అంది నీరజ. తండ్రి ముఖం వంక చూచి దిగులుగా 'యేం నాన్నా, వంట్లో బాగాలేదా?' అని అడిగింది.

నాకేం బాగేనే వున్నానమ్మా... కాకపోతే మరచి పోవటాన్ని మరచి ఆలోచి స్తున్నాను. పోనీలే, ఎవరికైనా ఆ మాత్రం మతిమరుపు వుండకపోదు. ఎప్పుడో ఒకప్పుడు అందరమూ యేదో ఒకటి మరిచిపోతాం... అన్నాడు.

'కానీ, నీ విషయంలో అది నిజంకాదుగా నాన్నా' అంది నీరజ ఆప్యాయంగా.

నేనూ మానవమాత్రుడినే కదమ్మా అంటూ అతను బహూమానంగా వచ్చిన కొత్త 'పెన్' తెరిచి లెటర్‌ప్యాడ్ మీద యిరవయి నాలుగు సంవత్సరాల వైవాహిక జీవితం! అరవయి నాలుగు కళలతో విలసిల్లును సతతం - అని వ్రాశాడు.

అతనికిప్పుడు మొత్తం ఎనిమిది ఫౌంటెన్ పెన్నులున్నాయి.

'సరిగా నాకు యిప్పుడు కావలసిన వస్తువు బహూమానంగా యిచ్చావమ్మా, చాలా థాంక్స్ నీకు...' అంటూ పెన్ను కోటు జేబులో అలంకరించుకున్నాడు.

నీకు సంతోషం అయితే అంతే చాలు నాన్నా... యింతకూ నన్ను యివాళ భోజనానికి బయటకు తీసుకువెడతానన్నావు. మరిచిపోలేదనుకుంటాను ఆమాట, అంది నీరజ. ముందు రోజు ఆమె తండ్రితో మాట్లాడటానికి వస్తానని చెప్పింది, ఫోన్ చేసి. అప్పుడు నారాయణరావు ఈ 'ఆఫర్' యిచ్చినమాట యదార్ధమే.

అతను నవ్వుతూ 'భలేదానివే. మరిచిపోలేదమ్మా. అలాగే వెడదాం...' అన్నాడు.

ఇద్దరూ దగ్గర్లో వున్న మంచి హోటలుకు వెళ్లి కూర్చున్నారు.

నీరజ 'మెనూ' కార్డు పరీక్ష చేస్తుండగా, నారాయణరావు కొడుకు వ్రాసిన ఉత్తరం తీసి చదువుకున్నాడు. సారాంశం, తను రెండు వందల యాభయి రూపాయలు పంపాలి. స్నేహితుడి కారు తీసుకుని, తన గర్ల్‌ఫ్రెండ్‌తో షికా

రుకు వెళ్లాడట కుర్రవాడు. అతి జాగ్రత్తగా డ్రయివ్ చేసినందువల్ల కారుకు జరిగిన ప్రమాదానికి పరిహారం నూటపాతిక, పక్కన కూర్చున్న చిన్నదాని ముక్కువంకర సరిచేయించడానికి మరో నూరు; నీతిశాస్త్రం మీద పుస్తకం కోసం పదిహేను రూపాయలు; మొత్తం 'రౌండు ఫిగర్' రావటానికి మరో పదిరూపాయలు! అంతే! నారాయణరావు ఉత్తరం నీరజకు అందించాడు.

'అమ్మాయీ, తమ్ముడు డబ్బు కావాలని రాశాడు. డ్రాఫ్ట్ తీసుకుని పంపించమ్మా...' అన్నాడు. కోట్ జేబు తడుముకున్నాడు చెక్ బుక్ కోసం, లేదు. బహుశ ఆఫీసు డ్రాయర్‌లోనే మరచిపోయి వుంటాడు.

ఫరవాలేదు నాన్నా, నేను పంపిస్తాను. తరువాత యిద్దువుగాని... అంది నీరజ.

తరువాత ఆమె తన స్వంత గొడవలు యేదో చెప్పింది. ముఖ్యంగా భర్త లోకనాథం గురించి. అతను తమ యింటికి నాలుగు వీధుల అవతల వున్న ఒక 'అందమయిన విధవరాలి' తో కాలక్షేపం చేస్తున్నాడని... ఆమెకు దృఢమయిన అనుమానం. తను యేంచేయాల్సిందీ నిర్ణయించుకునే ముందు తండ్రి ఒకమారు 'ఆయన' తో మాట్లాడి అయన ఉద్దేశం యేమిటో కనుక్కుంటే మంచిదని ఆమె ఆలోచన. ఎందుకంటే లోకనాథం ఆమెతో మాట్లాడడు. ఈ ప్రసక్తి తేవడం తోటే చొక్కా తొడుక్కుని యింట్లో నుంచి బయటకు వెళ్లిపోతాడు. రాత్రంతా బయటే గడిపి మరునాడు మధ్యాహ్నం భోజన సమయానికి తయారవుతాడు. తండ్రిని వెళ్లి అల్లుడితో మాట్లాడమనీ మరీ అవసరం అయితే 'అందమయిన విధవరాలు'ను కూడా మందలించమనీ నీరజ తల్లితో చెప్పకుంది.

'అమ్మ మీతో చెప్పిందా నాన్నా?'

'యే విషయం?'

— నీరజ మాట్లాడలేదు.

నారాయణరావు రెట్టించలేదు.

వెళ్లిపోయేముందు కళ్లనీళ్లు పెట్టుకుంటూ 'అసలే డబ్బు చిక్కుల్లోవున్నాం గదా.... మిమ్మల్ని డబ్బు అడగటానికి ముఖం చెల్లడంలే ఆయనకు...' అంది నీరజ.

ఈ నాలుగేళ్లలో లోపాయికారిగా అప్పుడప్పుడు అల్లుడు తనదగ్గర చేబదులుగా తీసుకున్న మూడువేల ఎనిమిది వందల యాభయిరూపాయలు గుర్తువచ్చాయి నారాయణరావుకు.

మందులు అమ్ముతాడు లోకనాథం.

పెళ్లిలో కట్నాలు కానుకలు బాగానే వసూలు చేశాడు. అల్లుడు తననేమీ 'యింప్రెస్' చేయకపోయినా, అమ్మాయి - భార్యా వొప్పుకున్నారు గదా అని ఆనందంగా కాళ్లుకడిగి కన్యాదానం చేశాడు నారాయణరావు.

ఆఫీసుకు వెళ్లేదారిలోనే భార్యకు బహుమానంగా అరవయి ఆరు రూపా యలు పెట్టి సుకుమారమయిన 'వానిటీ బ్యాగ్' కొన్నాడు. డబ్బు నీళ్లలా ఖర్చయిపోతోంది అని మనసులోనే సణుగుకున్నాడు.

భోజనానంతరం ఆఫీసులో పనిచేయడం కష్టం అయిపోయింది.

అమ్మాయి నీరజ బాల్యం... చదువు... సంధ్య... సుస్తీలు... అదుర్దాలు... పెళ్లి... కాపురం... యివన్నీ గుర్తుకువచ్చి మనసును కల్లోలపరిచాయి.

మధ్యాహ్నం దక్షిణామూర్తి రెండుమార్లు వచ్చి తొంగిచూచాడు. ఏదో పని గాడు కూడా. నారాయణరావు అతన్ని అవగింజ అంత అయినా పట్టించుకోలేదు. అయితే నేం... వీపుమీద చెదలు పాకినట్లే కాకుండా, ఊపిరి ఎగబిల్చడం కూడా ప్రారంభం అయింది.

ఆఫీసు అయిపోయినాక యథాప్రకారం లడ్ కార్నర్ హోటల్/ కూల్ డ్రింక్ షాపుకు వెళ్లాడు. వారానికి ఒక మారయినా అతను యిక్కడ జానకిని కలుస్తాడు. పదకొండు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు యిద్దరూ. జానకి సుజా తకు క్లాస్‌మేట్. స్నేహితురాలు కూడా. అందుచేతనే యిద్దరి సంపర్కమూ మర్యాదపురస్సరంగా గౌరవనీయంగా ఉంటున్నది. అరగంట అయేసరికి అతనికి పూర్వపు ఉత్సాహము, స్ఫూర్తి, ఉత్తేజము కలుగుతాయి. ఆనందంతో మనసు పరుగులు తీస్తుంది.

ఇంటికి వెడుతున్నంతసేపూ వాహనంలో నిలుచునే వున్నాడు. పేపరు నాలుగు పేజీలు విరామంగా తిప్పి చదువుకుందుకు అవకాశం లేకుండా అన్నీ పక్కలా జనం. మొదటి పేజీ 'హెడ్డింగ్'లే పదేపదే చదువు కోవలసి వచ్చింది.

ఇంకా అయిదు నిమిషాలలో యిల్లు చేరుకుంటాననగా గుర్తువచ్చింది, సుజాత కోసం కొన్న వానిటీ బాగ్ ప్యాకెట్ ఆఫీసులో బల్ల మీదనే మరచిపోయినట్టు! ఉదయం గదులు ఊడ్చే మనిషి దాన్ని 'కైంకర్యం' చేసినా చేయవచ్చును. అయిన తను యెలా మరచిపోగలిగాడు? ఎంత దోషం!

మరచిపోవడం మొదటి తప్పు.

గుర్తువచ్చి సరిచేసుకున్నతర్వాత... మళ్ళీ మరచిపోవడం ఎంత తప్పు!...

యిప్పుడు యేం చేసేట్లు?

మరచిపోకుండా... యిటువంటి సందర్భాలు మరి రాకుండా... యేదో మెలుకువలు తీసుకోవాలి.

విపరీతంగా కాఫీ తాగడం, కూల్ డ్రింక్స్ తాగడం... మానివేయాలి.

సాయంత్రం... సాదాసీదాగా గడిచిపోయింది. ఇంటికి వెడుతూ భార్యకోసం మల్లెలు మందారాలు కొన్నాడు కూతురుకు థాంక్స్ చెప్పుకుంటూ మనసులో వేనిటీ బ్యాగ్ ఆఫీసులో మరచిపోయినానని రేపు తెచ్చియిస్తాననీ చెప్పటానికి నోరురాలేదు. మరచిపోయినట్లు తనే వొప్పుకోవడం ఎలా? రేపు అది బల్ల మీద లేకపోతే, యింకో అరవయి అరు రూపాయలు!... పొద్దున్న చేసిన తప్పు రెట్టింపు ఐపోతుంది, దానిని గురించి యిప్పుడు యేమాత్రం మాట్లాడటానికి ప్రయత్నంచేసినా...

పొద్దున్న తాను చెప్పినవన్నీ తీసుకువచ్చి... బోలెడు డబ్బుపోసి – వండాననిచెప్పింది సుజాత.

నీరజ, లోకనాథం వచ్చారు.

వాళ్ళిద్దరూ చిలుకాగోరువంకలలా వున్నారనడంలో యేం అతిశయోక్తి కనిపించదు, నారాయణరావుకు.

నీరజ తల్లి దగ్గర కూర్చుండిపోయింది.

లోకనాథం తనతో మాట్లాడేందుకు ప్రయత్నించాడు యధాప్రకారం. అయినా అతనికి, తనకు 'కామన్ ఫాక్టర్స్' యేమున్నాయి మాట్లాడటానికి? అతనికి భాషాపరిజ్ఞానం లేదు; తనకు మందుల పరిజ్ఞానం అసలే లేదు.

తొమ్మిది గంటలకల్లా భోజనాలు ముగించారు. పదిగంటలకు సుజాత యేడుస్తూ మంచంలోనే మెలికలు తిరుగుతోంది. నారాయణరావుకు కూడా నిద్ర అంతంత మాత్రంగానే పట్టింది.

మరునాడు ఉదయం – ఆఫీసుకు వెళ్ళేసరికి... మొండిగా డెస్క్ మీద కనిపించిన 'వానిటీ బ్యాగ్' పాకెట్ చూచిన తర్వాత కూడా అతనికి నూతన ఉత్తేజం కలగలేదు. ఆరోజు అతన్ని 'మతిమరుపు' వేధించడం మానలేదు.

* * *

అంతా అలా ప్రారంభం అయింది.

పదమూడో అంతస్తులో వున్న రెఫరెన్స్ లైబ్రరీకి పదేపదే పరుగెత్తవలసి వస్తోంది. ఆఫీసులో అందరూ అతని చురుకు కదలికలకు ఆశ్చర్యపోయి చూస్తున్నారు.

ఈ 'బద్ధకం' అదే తొలగి పోతుందిలే... అని ఎవరికీ మాటమాత్రమయినా చెప్పలేదు. ఆఖరుకు జానకితోకూడా అనలేదు.

దక్షిణామూర్తి వెనక్కు 'నక్కి'నించుకున్నాడు. నారాయణరావు పనిచేస్తున్నట్లు నటిస్తున్నాడు. ఒకమారు, దక్షిణామూర్తి 'హోర్మోన్ల' గురించి యేమిటో సణిగాడు. తరువాత నాలుగు గంటలకు - 'పోనీ' ఈ పూటకు యింటికి పోయి విశ్రాంతి తీసుకో– అన్నాడు.

దక్షిణామూర్తిదగ్గర పనిచేయడం ప్రారంభించి యిప్పటికి పద్దెనిమిది సంవత్సరాలు అయింది. 'విశ్రాంతి తీసుకో' అనడం ఇదే మొదటిమారు.

దక్షిణామూర్తి వెళ్ళిపోయిన తర్వాత నారాయణరావు అక్కడే ఒక గంటసేపు డెస్క్ ముందు కూర్చుండి పోయాడు – ఎక్కడో అగాధాలలోనికి లోతుగా ప్రగాఢంగా చూస్తూ.

నారాయణరావు తను యేపత్రికలు కొనాలో మరచిపోయాడు. దుకాణం ముందు నిలబడి పోయి వేలాడుతున్న అన్ని పత్రికల వంక విచిత్రంగా చూస్తూ వుండిపోయాడు. అన్నీ ఒకటిగానే కనిపిస్తున్నాయి. ఈ రాత్రి రాష్ట్రపతి రేడియోలో ప్రసంగిస్తారని పక్కవాళ్లు చెప్పుకుంటున్నారు. నారాయణరావుకు 'రాష్ట్రపతి' పేరు గుర్తుకు రాలేదు. అతను యింతకు ముందు యేపార్టీవాడో అసలే గుర్తుకురాలేదు. ఒక్కక్షణంలో యేదో అవ్యక్తమయిన ఆనందం మనసును లోగొన్నట్లయింది. ఇదంతా భ్రమేనని అతనికి తెలుసును.

చివరకు యేదో పత్రిక కొనుక్కొని– ఆఫీసుకు వెళ్ళేంతసేపూ దాన్లోని రంగు రంగుల చిత్రాలు చూస్తూ కాలక్షేపంచేశాడు.

క్రోడి రామమూర్తిగారి జీవితకాలంయేమిటి– మొదటి ఇంగ్లీషు వార్తాపత్రిక ఆంధ్రదేశంలో ఎప్పుడు, యెక్కడ ప్రారంభం అయింది– అన్న విషయాలు తేదీలు గుర్తుకురాలేదు ఎంతప్రయత్నించినా. రెఫరెన్స్ లైబ్రరీలోనికి ఎన్నోమార్లు పరుగెత్తవలసి వచ్చింది.

ఆ మధ్యాహ్నం డెస్క్ముందు కూర్చుని ఆలోచిస్తూవుంటే–చేతుల్లో యెలుకలు పరుగెత్తుతున్నట్లు అనిపించింది.

ఇంతలో యెవరో వచ్చారు తనకోసం.

నారాయణరావు లేచి నిలుచుని 'హల్లో' అని కరచాలనం చేశాడుగాని అతను ఎవరో గుర్తురాలేదు; ఎంత బుర్రబద్దలు కొట్టుకున్నా.

'మీరు నాతో ఏదో మాట్లాడాలన్నారట. త్వరగా చెప్పండి...' అన్నాడు అతను ముందున్న కాఫీకప్పు కాళీచేస్తూ.

నారాయణరావు మనసంతా కెలుక్కున్నాడు. చివరకు నింపాదిగా... 'అబ్బే' ప్రత్యేకంగా యేంలేదు– అన్నాడు.

చాలాసేపు అయిన తర్వాత.... చివరకు విడిపోయే ముందు అతను – 'ఒకవేళ మీరు ఆ విషయం గనుక మాట్లాడదలుచుకుంటే—' అంటూ ప్రారంభం చేశాడు. నారాయణరావు 'యేమీలేదు—' అంటూ అతన్ని వదిలించుకుని ముందుకు వెళ్ళిపోయాడు వడివడిగా.

ఆఫీసులో 'స' అక్షరం వికారాలన్నీ అయిపోయినాయి.

'హ' లోనికి వచ్చాడు యిప్పుడు.

అతని బల్లమీద ఒక ఉత్తరం మొదలుపెట్టబడి వుంది. కానీ ఎవరికి వ్రాయదలుచుకున్నదీ గుర్తురాలేదు, ఎంతసేపటికీ. ఉత్తరం వ్రాయడం ప్రారంభిస్తూ వుండగా... అతడు వచ్చాడు. ఆ! ఇప్పుడు గుర్తువచ్చింది. ఆ వచ్చినతను నీరజ మొగుడు లోకనాథంకదూ?

తన అల్లుడు!

ఏదో డబ్బుసహాయం చేస్తానని అమ్మాయికి మాట యిచ్చాడు.

అల్లుడిని ఉత్తచేతులతో పంపేశాడు.

ఇదేం అనర్థాలకు దారి తీస్తుందో. అయినా ఈ అల్లుళ్లకు యిదేం ధోరణో! నీరజ కళ్ళలో నీళ్ళు నిండకుండా వుండటానికి తను యేమైనా చేయాలి గదా!

రెండు పావురాలు ఎదురుగా పిట్టగోడమీద కూర్చున్నాయి. ఎదురుభవంతిలో కిటికీదగ్గర – ఓ బట్టతలవాడు సిగరెట్ కాలుస్తూ నిలుచుని వున్నాడు. దాన్లోంచి దూకి ఆత్మహత్య చేసుకుందామని అనుకోవడం లేదుగదా వాడు!

నారాయణరావు మళ్ళీ తన ప్రపంచంలోనికి వచ్చాడు.

కొడుక్కు డబ్బు జాగ్రత్తగా వాడుకోమని హెచ్చరిక చేయాలి. కోటువేసుకుని బయటకు నడిచాడు.

టైం ఇంకా మూడు ఇరవై అయిదే.

రోడ్డు పొడుగునా నడుస్తూ మ్యూజియం దగ్గరకు చేరుకున్నాడు. మ్యూజి

యంలో కొంత సేపు గడిపి ఇంటి ముఖంపట్టాడు. రైల్లోవున్నంత సేపూ చెలాకీగానే వుంది. పేపర్లు కొనడానికి ప్రయత్నం చేయలేదు. అ పేపర్లలో యేమీ వుండదు. అంతకంటే రైల్లో మనుషుల ముఖాలే అక్షరాలు పులుముకుని అందంగా వుంటాయి.

ఇంటికి రావడంతోటే తలుపుతోసుకుని 'బెడ్ రూం' లోనికి వెళ్ళాడు.

తనలో వస్తున్నమార్పులు సుజాత గమనించకుండా జాగ్రత్తపడాలి. లేకపోతే ఉత్తినే ఖంగారు పడిపోతుంది, బెదిరిపోతుంది! తనకు చికిత్స చేయిస్తానంటుంది.

సాయంత్రం అంతా 'టేప్‌రికార్డర్' లో 'మ్యూజిక్' వింటూ గడిపేశాడు. టేప్ మార్చాలన్న ధోరణేలేదు. అదే పాట-- తిరిగి... తిరిగి... చివరకు సుజాత వచ్చి బోరెత్తిపోతోంది, అని టేప్‌రికార్డర్ ఆఫ్ చేసింది.

అరోజు త్వరగా—నిద్రకు ఉపక్రమించాడు. పక్క మంచం మీద సుజాత యేడుస్తూ పడుకుని వుంది. ఈ నెలలో అప్పుడే యిది మూడోమారు. అంటే ఇంకా రెండు మూడు బకాయి వున్నాయన్నమాట.... అని గుర్తుతెచ్చుకున్నాడు.

మరునాడు మధ్యాహ్నం ఆఫీసులో యింకా 'హ'తో కుస్తీ పడుతున్నాడు. నిదానంగా ఓపికగా పనిచేసుకుంటున్నాడు. ఇంతలో ఎవరో తన వెనకాల నిలబడినట్లు అనిపించింది. కుర్చీలోంచి అమాంతం పైకి లేచాడు. నెరుస్తున్న జుట్టు... ట్వీడ్ సూట్‌తో ఒక ఆసామీ అక్కడ నిలబడి తన వంకే గుచ్చి గుచ్చి తేరిపార చూస్తున్నాడు.

'ఎవరు? ఎవరికోసమయినా వచ్చారా?' అని అడిగాడు నారాయణరావు.

అ మనిషి దిగ్భ్రమ చెందాడు.

ముఖం కందగడ్డ అయింది.

గదిలోంచి బయటకు వెళ్ళాడు. నారాయణరావు తన పనిలో మునిగిపోయాడు.

అరోజు లిఫ్ట్‌లో యెక్కువమంది జనం వున్నట్లు అనిపించింది.

గుమాస్తాలు – సెక్రటరీలు – యిళ్ళకు వెళ్లటానికి హడావిడిపడుతున్నారు. ఆఫీసుగుమ్మందగ్గర ఓ పడుచు అమ్మాయి ఎదురయింది. తనను చూచి నవ్వింది. నారాయణరావు ఒక్క క్షణం ఆగాడు. మళ్ళీ నవ్వుదాం అనుకున్నాడు... జానకి యివాళ కలుస్తానంది... అయినా తను యిలాంటి విషయాలలో వయసుమీరిపోయిన వాడుగదా?... అని తమాయించుకున్నాడు. ముఖం కిందకు వాల్చుకుని జనంలో కలిసి పోయాడు.

వెనకనుంచి ఎవరో 'నాన్నా... నాన్నా...' అని పిలవడం వినిపించింది గాని.... అది తనను కాదు, 'అసంభవం' అనుకుంటూ తల వెనక్కు తిప్పే ప్రయత్నం చేయలేదు.

దుకాణాలవంక చూసుకుంటూ నడకసాగించాడు. జానకి కలుసుకుంటానన్న హోటల్లో ప్రవేశించాడు.

జానకి అక్కడలేదు.

ఇంటి దగ్గర అంతా మామూలే.

సుజాత ముఖం కందగడ్డ.

ముక్కునులిమి నులిమి మళ్లీ ఎర్రబడి పోయింది.

మధ్యాహ్నం అంతా ఏడ్చివుంటుంది. ఐనా ఆశ్చర్యం!... సుజాత యెప్పుడూ ఒంటరిగా యేడవదే!

భోజనాల దగ్గర సుజాత అంది. 'యింకా ఎన్నాళ్లు నన్ను యిలా అమాయకురాలిని చేసి యేడిపిస్తారు? మీరు ఆవిడతోనే కాపురం చేయండి. నాబతుకు ఎలాగూ అతలాకుతలం అయిపోయింది.'

రాత్రి పడుకున్నప్పుడు జనంతో కిక్కిరిసిన 'త్రి-టయర్' కంపార్ట్‌మెంట్‌లో మధ్య బెర్త్ మీద పడుకున్నట్లు అనిపించింది, అతనికి.

'నా జీవితం ఎలాగూ పాడయిపోయింది. పోనీ అమ్మాయి విషయం అయినా అల్లుడుతో మాట్లాడి సరిచేయండి...'

'యేం చేయాలి?'

'అదే... నాలుగు వీధుల అవతల....'

నారాయణరావు ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

'అవును మీకు యిష్టం వుండదు. మీరు మగవాళ్ళు. మీరూ అలాగే చేస్తున్నారుగా. ఏ మొఖం పెట్టుకుని అల్లుడితో ఈ విషయం ప్రస్తావన చేస్తారు. మీకు చేతకాదు...

అతనికి చిరాకు అనిపించింది.

'అదంతా మీ భ్రమ. ఎందులోనూ నిజం లేదు, కల్పన. తీరికగాకూర్చుని చేసుకుంటున్న ఊహాపోహలు...'

'చాల్లెండి ఏమయినా అంటే నిఘంటువులో మాటలన్నీ వల్లెవేస్తారు...'

....సుజాత యేడుపు యెక్కువ చేసింది.

* * *

బయట లేత ఎండ కిటికీలోంచి మీద పడడంతోటే మెలుకువ వచ్చింది.

పక్కమంచం మీదనుంచి చప్పుడు వినవస్తోంది. అటు చూచాడు.

ఆ మంచం మీద ఎవరో పడుకునివున్నారు.

మధ్యవయసు యువతి గుర్రుపెట్టి నిద్రపోతోంది.

నారాయణరావు ఆమెవంక తేరిపార చూచాడు. ఇన్నేళ్ళ తన జీవితంలోనూ ఆ మనిషిని చూడడం... యిదే మొదటిమారు. ఎవరామె?

పక్కమీంచి లేచి... దుస్తులు వేసుకుని... రోడ్డు మీదకు నడిచాడు. జనం ఊరికే పరుగులు తీస్తున్నారు.

వాళ్ళను కలవాలి. ఎక్కడకు వెళ్ళాలి?

తన ఆఫీసు బిల్డింగ్ ఎక్కడ?

ఈ రోజుల్లో అన్ని బిల్డింగ్‌లూ ఒకే మోస్తరుగా వున్నాయి.

నారాయణరావు వడివడిగా ముందుకు పరుగెడుతున్నాడు. *